

సీతంపేటలో ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్

ప్రకృతి అందాలకు నిలయం.. మన్యం



సందర్శకులను విశేషంగా ఆకట్టుకునే ఆడలి వ్యూపాయింట్

- జిల్లాలో పర్యాటక ప్రాంతాలెన్నో..
- పిక్నిక్ స్పాట్లుకు కొదవే లేదు..

సీతంపేట రూరల్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రకృతి సహజసిద్ధ అందాలకు కొదవే లేదు. ఎత్తయిన కొండలు.. జలపాతాలు.. వ్యూపాయింట్లు, అడ్వంచర్ పార్కులు, ప్రముఖ దేవాలయాలు.. ఇలా ఎన్నో ఉన్నాయి. ప్రకృతి ప్రేమికులను సైతం కట్టిపడేసే ప్రదేశాలెన్నో ఉన్నాయి. అందుకే తరచూ పర్యాటకులు 'మన్యం'లో ప్రాంతాలను సందర్శిస్తుంటారు. కార్తీకమాసంలో పిక్నిక్‌స్పాట్లుగా మార్చుకుంటారు. కుటుంబాలతో ఇక్కడకు వచ్చి సందడి చేస్తుంటారు. స్నేహితులు, బంధువులతో కలిసి రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతారు. జిల్లాలో పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండలో ఎన్నో పిక్నిక్ స్పాట్లు ఉన్నాయి. ప్రధానంగా సీతంపేట మన్యంలో సున్నపుగెడ్డ, ఆడలి వ్యూ పాయింట్, ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్, మెట్టుగూడ జలపాతం, సాలూరు ఏజెన్సీలో ఉన్న జలపాతాల వద్ద సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. ఎటు చూసినా పచ్చదనమే కనిపించడంతో కార్తీకమాస సీజన్‌లో విందులు, వినోదాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడుపుతారు. పిక్నిక్ స్పాట్లుగా గుర్తింపు పొందిన ఆయా పర్యాటక ప్రాంతాల్లో వసతి, రవాణా సదుపాయాలను మెరుగుపరచాల్సి ఉంది. దీనివల్ల సందర్శకుల సంఖ్య పెరగడంతో పాటు ప్రభుత్వానికి భారీగా ఆదాయం రానుంది. గిరిజన యువతకు కూడా స్థానికంగానే ఉపాధి దొరకనుంది. సీతంపేట, పార్వతీపురం ఐటీడీఏల పరిధిలోని పర్యాటక ప్రాంతాలపై ఇప్పటికే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రానున్న రోజుల్లో జిల్లాలో సందర్శక ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పొచ్చు.

నేడు 'ప్రపంచ పిక్నిక్ దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనాలు.. 6లో

గిరి పుత్రుల దశ మారేనా?

- ఏజెన్సీలో ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రభుత్వం చర్యలు
- పాఠశాలలకు పక్కా భవనాలు.. నిధులు మంజూరు
- రేకులషెడ్లు, శిథిలావస్థ బడుల్లో చదువులకు స్వస్తి
- గిరిజన విద్యార్థులకు తీరనున్న కష్టాలు



ఇటీవల జి.గుమ్మడ పాఠశాలకు ప్రహరీ నిర్మించిన దృశ్యం

సీతంపేట రూరల్, జూన్17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గిరిజన చిన్నారులు పాఠశాలలకు వెళ్లి ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తోంది. శిథిలావస్థలో, రేకుల షెడ్డులో ఉన్న పాఠశాలల స్థానంలో కొత్త భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. మరో మూడు నెలల్లో వాటి పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. మొత్తంగా కూటమి ప్రభుత్వ చొరవతో త్వరలోనే గిరిజన చిన్నారుల కష్టాలు తీరనున్నాయి.

ఇదీ పరిస్థితి..

మండలంలో 75 ఎంపీయూపీ పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 2,200 మందికి పైగా గిరిజన చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. సుమారు 12 పాఠశాలలు శిథిలావస్థలో ఉండగా.. మరికొన్ని రేకులషెడ్డుల్లో నడుస్తున్నాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వం గిరిజన విద్యపై నిర్లక్ష్యం వహించింది. దీంతో గిరిజన విద్యార్థులు రేకులషెడ్డుల్లోనే చదువులు కొనసాగించాల్సి వస్తోంది. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలైతే ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి. దీంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ విద్యనభ్యసించాల్సి వస్తోంది. వర్షాకాలంలో అయితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చిన్నారులను పాఠశాలలకు పంపించేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇదే సమయంలో మన్యంలో డ్రాపౌట్ల సంఖ్య క్రమేపీ పెరుగుతూ వస్తోంది.

వైసీపీ హయాంలో..


గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద అర కొర నిధులు విడుదల చేయడంతో గిరిజన పాఠశాలల భవనాలు చాలా వరకు పునాది దశలోనే నిలిచిపోయాయి. దీంతో గిరిజన విద్యార్థులకు వసతి సమస్య వేధిస్తోంది. చాలీచాలని ఇరుకు గదుల్లోనే చదువుకోవాల్సి వస్తోంది.

ఎస్ఎస్ఏ నిధులతో నిర్మాణాలు

సీతంపేట ఏజెన్సీలో ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో, రేకులషెడ్డుల్లో నడుస్తున్న పాఠశాలలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. పక్కా భవనాలు నిర్మించేందుకు (మిగతా 8వ పేజీలో...)

జనగణనతో మార్పులెన్నో..

- జిల్లాలో పెరగనున్న అసెంబ్లీ నియోజకవర్గాలు
- అరకు పార్లమెంట్‌ను రెండుగా విభజించే అవకాశం
- నియోజకవర్గ స్వరూపాలు, రిజర్వేషన్లూ మారే చాన్స్
- ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహుల్లో విస్తృత చర్చ



పార్వతీపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జనగణనకు కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కార్యక్రమాన్ని రెండు దశల్లో నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. మొదటి దశలో భాగంగా.. ప్రజల ఇంటి పరిస్థితులు, వారి ఆస్తులు, ఇళ్లలో ఉండే సౌకర్యాల వివరాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియను 2026, ఏప్రిల్‌లోనే ప్రారంభించనున్నట్టు సమాచారం. దీనివల్ల రాష్ట్రంలో ఉన్న 175 అసెంబ్లీ స్థానాలు 225కు పెరగనున్నాయి. అంటే దాదాపు 50 అసెంబ్లీ స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఇందులో భాగంగానే జిల్లాలో ప్రస్తుతం ఉన్న నాలుగు నియోజకవర్గాల సంఖ్య ఐదు లేదా ఆరుకు పెరగనుందని ఓ అంచనా. అరకు పార్లమెంట్‌ను కూడా రెండుగా విభ జించనున్నారు. జిల్లాలో రిజర్వేషన్లూ మారుతాయి. కుల , జనగణన అనంతరం నియో జకవర్గాల స్వరూపాలు మారిపోతాయి. కుదింపులు, చేర్పులు, మార్పులతో వాటి సంఖ్య పెరగనుంది. జిల్లా పరిధిలో పెరిగే అసెంబ్లీ నియోజకవర్గాలన్నింటినీ కలుపుకుని ఒక ప్రత్యేక పార్లమెంట్ స్థానం ఏర్పాటు చేయొచ్చు. అరకు పార్లమెంట్ ఏర్పటవక ముందు ఉన్న పార్వతీపురం పార్లమెంట్‌ను పునరుద్ధరించే అవకాశం కూడా లేకపోలేదు. మొత్తంగా అసెంబ్లీకి లేదా పార్లమెంట్‌కు పోటీ చేయాలని ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఆశావహుల్లో ఇప్పుడిదే చర్చనీయాంశంగా మారింది.

ఓటర్లు ఇలా..

పాలకొండ నియోజకవర్గంలో 1,97,976 మంది ఓటర్లు ఉన్నారు. కురుపాంలో 1,91,112 మంది, పార్వతీపురంలో 1,88,090 మంది, సాలూరులో 1,97,395 మంది ఓటర్లు ఉన్నారు. పాలకొండ, సాలూరు, కురుపాం నియోజకవర్గాలు ఎస్టీగా, పార్వతీపురం నియోజకవర్గం ఎస్సీ రిజర్వేషన్ పరిధిలో ఉన్నాయి.

మారనున్న నియోజకవర్గాల స్వరూపం..

సాలూరు నియోజకవర్గంలో సాలూరు పట్టణం, మండలం, మెంటాడ , పాచిపెంట, మక్కువ మండలాలు ఉన్నాయి. భౌగోళికంగా చూస్తే మెంటాడ విజయగనరం జిల్లాలో కలిసే అవకాశం ఉంది. పార్వతీపురం నియోజకవర్గంలో పార్వతీపురం పట్టణం, మండలం సీతానగరం, బలిజిపేట మండలాలు ఉన్నాయి. కురుపాం నియోజకవర్గంలో (మిగతా 8వ పేజీలో...)

ఖరీఫ్‌నకు సర్వం సిద్ధం

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్

జియ్యమ్మవలస, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సర్వం సిద్ధం చేశామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్‌పాల్ తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై పూర్తిస్థాయిలో అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. మంగళవారం పెదబుడ్డిడిలో ఎంటీయూ 1318 రకం వరి విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు పాటించాల్సిన మెళకువలు, జాగ్రత్తలు వివరించారు. వరి గట్లపై కందులు సాగు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల పంట రక్షణతో పాటు అదనపు ఆదాయం పొందొచ్చని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబం. దించి రైతులందరూ ఈ నెల 20లోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కౌలు రైతులు విధిగా కార్డులు చేయించుకోవాలని సూచించారు.

ఎండీయూ వ్యవస్థతో తగ్గిన జీసీసీ వ్యాపారం

- ఏటా రూ.6.8 కోట్లు కోల్పోయినట్లు డీఎం రామరావు వెల్లడి

సాలూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన ఎండీయూ (మొబైల్ డిస్పెన్స్ యూనిట్) వాహనాల వల్ల జిల్లాలో జీసీసీ వ్యాపారం భారీగా తగ్గిందని, సుమారు రూ. 6.8 కోట్ల వరకు కోల్పోయినట్లు డీఎం జలుమూరి రామారావు తెలిపారు. మంగళవారం కొత్తవలస డీఆర్ డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థ లేనప్పుడు గిరిజనులు డీఆర్ డిపోలకు వచ్చి రేషన్ తీసుకునేవారు. నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుని వారి ఉత్పత్తుల విక్రయించేవారు. దీంతో ఏటా జీసీసీకి జిల్లాలో రూ. 12 కోట్ల వ్యాపారం జరిగేది. గత ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థ తీసుకురావడం వల్ల డీఆర్ డిపోలకు గిరిజనులు రావడం మానేశారు. దీంతో జీసీసీ వ్యాపారం రూ.5.2 కోట్లకు పడిపోయింది. ఏటా రూ.6.8 కోట్ల వ్యాపారం కోల్పోవడంతో జీసీసీ బలహీన పడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థకు స్వస్తి చెప్పి డీలర్ల ద్వారా సరుకుల పంపిణీ చేయించడం జీసీసీకి వరంగా మారింది. డీఆర్ డిపోలకు గిరిజనులు వస్తున్నారు. రేషన్‌తో పాటు నిత్యావసర సరుకులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో డీఆర్ డిపోలు బలోపేతం కానున్నాయి. గిరిజనులు సేకరించే అటవీ ఉత్పత్తులను ఎప్పుడైనా డీఆర్ డిపోలల్లో విక్రయించుకోవచ్చు. మన్యం జిల్లాలో 95 , విజయనగరం జిల్లాలో ఆరు డీఆర్ డిపోలున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో 26 డీఆర్ డిపోలకు నూతన భవనాలు నిర్మించడానికి, మరో 36 డిపోలకు మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు పంపించాం.' అని తెలిపారు.



కొత్తవలస డీఆర్ డిపోను పరిశీలిస్తున్న జీసీసీ డీఎం

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏపీఎంలు, సీవోలు, ఆర్‌పీలతో సమీక్షించారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామికవేత్త వచ్చేలా కృషి చేయాలన్నారు. మహిళలకు జీవనోపాధులు కల్పించి వారి ఆదాయాన్ని రెట్టింపు చేయాలని, ప్రతిఒక్కరూ లక్షాధికారి కావాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులతో కొత్త వ్యాపార యూనిట్లను స్థాపించాలన్నారు. కొత్త ఆలోచనలతో వ్యాపారాలను విస్తరించి.. లాభాలు ఆర్జించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొబైల్ మార్టులు, కాఫీ షాపుల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందొచ్చన్నారు. సూర్యఘర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

ఏనుగుల కొండ వద్ద సందడిగా యోగాంధ్ర

- భాగస్వాములైన మంత్రి, కలెక్టర్ తదితరులు 6లో

డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలు కావాలి 6లో

- గ్రామీణాభివృద్ధి సంస్థ డీపీఎం రామ్మోహనరావు

మారనున్న గిరిజనుల బతుకులు

- 'ఉత్కర్ష్ అభియాన్'కు 165 గ్రామాల ఎంపిక 8లో

సుందరయ్యగూడలో ఏనుగులు 6లో



రీసర్వేపై నిర్లక్ష్యం వహించొద్దు

- జిల్లా సర్వే అధికారి లక్ష్మణరావు



మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారి లక్ష్మణరావు

గరుగుబిల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న భూముల రీసర్వేపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా సర్వే అధికారి పి.లక్ష్మణరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సచివాలయాల సర్వే సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...'జిల్లాలో మొదటి విడత 13 గ్రామాలు, రెండో విడత 30 గ్రామాల్లో రీసర్వే జరుగుతుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఆయా గ్రామాల వివరాలను విలేజ్ సర్వేయర్ లాగిన్‌లో పొందుపర్చాలి. గతంలో 317 గ్రామాల్లో సర్వే నిర్వహించాం. జూలై నెలాఖరుకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. వెబ్‌ల్యాండ్‌లో తప్పిదాల కారణంగా గ్రామస్థాయిలో సర్వేకు కొంత మేర ఆటంకాలు ఏర్పడుతున్నాయి. గతంలో నిర్వహించిన రీసర్వేలో లోపాలు ఉన్నాయి. ఈ కారణంగా మ్యూటేషన్లకు సమస్యలు ఏర్పడుతున్నాయి. భూవిస్తీర్ణాన్ని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అన్నదాతల భూములు వేరొకరి పేరుపై నమోదై ఉంటే తగిన ఆధారాలు చూపించాలి. తక్షణమే పేరు మార్పు చేస్తాం.' అని తెలిపారు.

'ఆడుదాం..ఆంధ్రా' నిధులపై విజిలెన్స్

- మంజూరు, ఖర్చులపై ఆరా
- రికార్డుల పరిశీలన

పార్వతీపురం టౌన్, జూన్17(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో (2023-24) నిర్వహించిన 'ఆడుదాం..ఆంధ్రా' క్రీడా పోటీలకు సంబంధించి నిధుల మంజూరు, ఖర్చులపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్, ఎంపీడీవో కార్యాల యాల్లో విజిలెన్స్ సీఐ సతీష్‌కుమార్ (శ్రీకాకుళం) ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు తదితరులు రికార్డులు పరిశీలించారు. నిధులు మంజూరు, వినియోగంపై సంబంధిత సిబ్బంది వివరణ కోరారు. అనంతరం సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'ఆడుదాం..ఆంధ్రా ' (మిగతా 8వ పేజీలో...)



మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గిరి చైతన్యం కోసం ప్రత్యేక వాహనం

- ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి



పార్వతీపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజనులకు పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు 'గిరి చైతన్యం' పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాన్ని మంగళవారం మక్కువలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు. సికిల్‌సెల్ అనీమియా, దోమతెరల వినియోగం, మలేరియా నివారణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రత్యేక వాహనం ద్వారా గిరిపుత్రులకు తెలియజేయనున్నారు. అంతేకాకుండా సంతల్లో నాణ్యమైన వస్తువులు విక్రయించేలా చర్యలు తీసుకోనున్నారు. ఏదేమైనా రాష్ట్రంలోనే తొలిసారిగా మన్యం జిల్లాలో ఈ తరహా కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. స్క్రీన్ ప్రజెంటేషన్ ద్వారా అన్ని అంశాలపై గిరిజనులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

ఎన్నెన్నో అందాలు



తాటిపూడి వద్ద సందర్శకుల సందడి

నేడు ప్రపంచ పిక్నిక్ దినోత్సవం

● జిల్లాలో ఆకట్టుకుంటున్న ప్రదేశాలు ● ఏటా వేలల్లో సందర్శకుల రాక

పిక్నిక్..
ఈ పదం వింటే సరదా పడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఐక్యతకు... స్నేహభావానికి చిహ్నంగా భావించే పిక్నిక్‌లతో కలిగే ఆనందాన్ని వెలకట్టలేం. ఏటా పిక్నిక్ సీజన్‌లో జిల్లాలోని పర్యాటక కేంద్రాలు ఏ స్థాయిలో సందడిగా ఉంటాయో మనకు తెలిసిందే. అంతేకాదు...వచ్చే ఏడాది ఎక్కడికి వెళ్లాలో ఈ సంవత్సరమే నిర్ణయించి... ప్రణాళికలు అమలు చేసేది ఎందరో. వీరి సరదాలకు తగినట్లే పిక్నిక్ స్పాట్లూ ఊరిస్తుంటాయి. దీంతో వేలాది మంది ఈ కేంద్రాల్లో సందడిగా గడుపుతుంటారు. బుధవారం 'ప్రపంచ పిక్నిక్ దినోత్సవం' సందర్భంగా జిల్లాలోని వివిధ స్పాట్లను చూసేద్దాం రండి.



తాటిపూడిలో బోటుషికారు చేస్తున్న సందర్శకులు

పచ్చని ప్రకృతి నడుమ..


గంట్యాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముఖ్యమైన పిక్నిక్ స్పాట్‌లలో తాటిపూడి రిజర్వాయర్ ఒకటి. చుట్టూ కొండలు... మధ్యలో నీటితో ఈ ప్రాంతం చూపరులను కట్టి పడేస్తుంది. కార్తీక మాసంలో పిక్నిక్‌లకు వచ్చే సందర్శకులతో ఇక్కడ సందడిగా ఉంటుంది. ఇతర జిల్లాల నుంచి కూడా ఎక్కువ సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. ఇక సాధారణ రోజుల్లోనూ ఈ ప్రాంతం చూడడానికి సందర్శకులు వస్తుంటారు. రిజర్వాయర్‌లో బోటు షికారుకు ఇరిగేషన్ అధికారుల నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అనుమతి తీసుకున్నారు. ఈ ఏడాది జనవరి 3న బోటు షికారును ప్రారంభించారు. ఇక్కడికి దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కనీస సదుపాయాలు లేవు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కూడా లేవు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు రాత్రి సమయంలో బస చేయడానికి కూడా ఎక్కడా అవకాశం లేదు. రానున్న కార్తీక మాసంలోగా సదుపాయాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక.. పర్యాటక కేంద్రం.. పుణ్యగిరి

శృంగవరపుకోట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట సమీపంలోని పుణ్యగిరి క్షేత్రం అటు ఆధ్యాత్మికంగా.. ఇటు పిక్నిక్ స్పాట్‌గా గుర్తింపు పొందింది. ఏటా కార్తీకమాసంలో పిక్నిక్‌లకు వచ్చే వారితో ఈ ప్రాంతం సందడిగా ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు కొండపైనున్న ఉమాకోటి లింగేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఇక్కడి తోటలు, కొండపైనున్న చెట్ల కింద వనభోజనాలు చేస్తుంటారు. చుట్టూ పచ్చదనం.. పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండడంతో ఇక్కడే వంటలు చేసుకుంటారు. సహపంక్తి భోజనాలు చేస్తుంటారు. విశాఖ జిల్లాలోని అరకు వేళ్లే వారిలో కొంతమంది పుణ్యగిరిని దర్శిస్తారు. మెట్లమార్గంలో నడిచివెళ్లడం.. మార్గమధ్యలో దారగంగమ్మ జలపాతంలో స్నానం.. పుట్టధార జలం కింద తల తడుపుకోవడం మంచి అనుభూతినిస్తున్నాయి.

ఎలా చేరుకోవాలంటే...

శృంగవరపుకోట పట్టణంలోని దేవీబొమ్మ కూడలి నుంచి పుణ్యగిరికి రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. మహాశివరాత్రి సమయంలో ఆర్టీసీ బస్సులు నడుపుతుంది. కార్తీక మాసంలో ఆటోలు అందుబాటులో ఉంటాయి. మిగిలిన సమయంలో సొంత వాహనాల్లో వెళ్లాలి. ఆటోలను అద్దెకు మాట్లాడుకోవాలి. ఎలాంటి వాహనమైనా కొండ దిగువ ప్రాంతం వరకు మాత్రమే వెళుతుంది. అక్కడి నుంచి కొండపైకి మెట్ల మార్గం మాత్రమే ఉంది. విశాఖపట్టణం, విజయనగరం, అరకు నుంచి శృంగవరపుకోటకు ఆర్టీసీ బస్సులు ఉన్నాయి.



ఎస్.కోట: పుణ్యగిరి ఉమా కోటి లింగేశ్వర దేవాలయం



ఎస్.కోట: దారగంగమ్మ జలపాతం



సుందరయ్యగూడ సీసీ రహదారిపై ఉన్న ఏనుగులు

సుందరయ్యగూడలో ఏనుగులు

సీతంపేట రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలోని సుందరయ్యగూడ కాలనీ సమీపంలో గజరాజులు తిష్ట వేశాయి. మంగళవారం ఉదయం సుందరయ్యగూడ కాలనీ సమీపంలోని జీడితోటల్లో సంచరించిన ఏనుగులు ఘీంకారాలు చేస్తు రహదారిపైకి వచ్చాయి. దీంతో గ్రామంలోని గిరిజనులు భయంతో పరుగులు తీశారు. రాత్రి సమయంలో ఎక్కడ తమ గ్రామంలోకి ప్రవేశించి.. దాడి చేస్తాయోనని సుందరయ్యగూడ, పులిపుట్టి గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. అటవీ అధికారులు స్పందించి నాలుగు ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు కోరుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● మంత్రి సంధ్యారాణి



బెలూన్లు విడిచి పెడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

మక్కువ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని... ప్రతి ఒక్కరూ దీనిని దినచర్యగా మార్చుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శంబర గ్రామ సమీపంలో ఉన్న వెంగళరాయసాగర్ జలాశయం వద్ద ఉన్న ఏనుగుల కొండ వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ యోగాతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఆధునిక జీవితంలో మానసిక, శారీరక ఒత్తిడిని తగ్గించుకొనేందుకు యోగా ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ నెల 21న విశాఖపట్నంలో జరుగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. రంగుల బెలూన్లు గాలిలోకి వదిలి యోగాంధ్రకు పిలుపునిచ్చారు. ఈ నెల 21న విశాఖలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో జిల్లాకు చెందిన 28 వేల మంది విద్యార్థులు ప్రధాని ఎదుట 108 సూర్య నమస్కారాలు ప్రదరించనున్నట్టు తెలిపారు.

పర్యాటక ప్రాంతంగా ఏనుగుల కొండ..

ఏనుగుల కొండ వద్ద భవిష్యత్తులో వెంగళరాయ సాగర్‌లో బోటింగ్, ట్రెక్కింగ్ వంటి సదుపాయాలు కల్పిస్తూ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. యోగాను మన జీవితంలో ఓ భాగంగా మలచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డుమా పీడీ కె.రామచంద్ర, డీఎంఅండ్‌హెచ్‌వో భాస్కరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బి.సుశీల తదితరులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తదితరులు

'తల్లికి వందనం' మంచి పథకం

● త్వరలోనే అన్నదాత సుఖీభవ
● వైసీపీ పుస్తకాన్ని చెత్తబుట్టలో వేయండి ● డీసీసీబీ చైర్మన్ నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం కార్యక్రమం చాలా గొప్పదని.. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నప్పటికీ.. ఒక్కరికే అమ్మ ఒడి పథకాన్ని వర్తింపజేసిందని విమర్శించారు. తాము చెప్పిన ప్రకారం తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో చదువుకుంటున్న పిల్లలు అందరికీ అందించామని తెలిపారు. వైసీపీ అధికార సోషల్ మీడియా వేదికగా స్థాయికి తగ్గి ప్రవర్తించిందని విమర్శించారు. గత ఐదేళ్లు నీచమైన పరిపాలన అందించిన నేపథ్యంలోనే ప్రజలు వైసీపీని ఇంట్లో కూర్చోబెట్టారన్నారని ఎద్దేవా చేశారు. రూ.3 వేలు పింఛను పెంచడానికి ఐదేళ్లు పట్టిందన్నారు. ధాన్యం కొనుగోలు డబ్బులు రైతులకు సకాలంలో చెల్లించలేదని ఆరోపించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల అకౌంట్లలో త్వరలోనే నిధులు జమ కానున్నా యన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఆగస్టు15 నుంచి అమలు చేయనున్నట్టు తెలిపారు.

చెత్తబుట్టలో వేయండి..

వైసీపీ రూపొందించిన పుస్తకాలను చెత్తబుట్టలో వేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున చెప్పారు. వైసీపీ వైఫల్యాలను కప్పిపుచ్చుకుని మళ్లీ ప్రజల మధ్యకు రావాలని చూస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు దంగా భూలోక, చినబాబు, రాములప్పలనాయుడు పాల్గొన్నారు.



పైడిమాంబకు పుష్పాభిషేకం

విజయనగరం రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, సిరులతల్లి పైడిమాంబకు మంగళవారం పుష్పాభిషేకం నిర్వహించారు. మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు. వివిధ రకాల పువ్వులతో పైడిమాంబకు ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పిండివంటలు, పండ్లను నైవేద్యంగా సమర్పించారు.

గోమాతల పరిరక్షణ కోసం సైకిల్ యాత్ర

● ఒడిశా నుంచి జమ్ము కశ్మీర్ వరకు యువకుడి ప్రయాణం

రాజాం రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గోమాతను పరిరక్షించాలంటూ ఒడిశాలోని జార్సుగుడా ప్రాంతానికి చెందిన పాతికేళ్ల యువకుడు సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టాడు. ఇప్పటివరకూ ఎనిమిది రాష్ట్రాలలో యాత్ర పూర్తి చేశాడు. పది మంది ఉన్న చోట ఆగి... గోవధ పాపమని, పశు సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రచారం చేస్తూ... ముందుకు సాగుతున్నాడు. యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం రాజాం చేరుకున్నాడు. ఆ యువకుడి పేరు సుబ్రత్ మహరాణా. జార్సుగుడా జిల్లాకు చెందిన మహరాణా మార్చి 16న ఇంటి నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించినట్టు చెప్పాడు. ఇప్పటి వరకూ ఎనిమిది రాష్ట్రాల మీదుగా పర్యటన కొనసాగిందన్నాడు. లడక్ వరకూ సైకిల్ యాత్ర కొనసాగించనున్నట్లు స్పష్టం చేశాడు. హిందువులు పవిత్రంగా పూజించే గోమాతను వధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తన తండ్రి మృతి చెందారని... తల్లి అంగీకారంతో తాను సైకిల్ యాత్ర ప్రారంభించినట్లు వెల్లడించాడు. సైకిల్ యాత్రలో తనను ఎక్కడికక్కడ ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపాడు. ఆహారం, పండ్లు అందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశాడు సుబ్రత్ మహరాణా.



సైకిల్‌పై సుబ్రత్...



పాగిరిలో సుబ్రత్‌కు పండ్లు అందజేస్తున్న యువకులు

త్వరలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

● డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

విజయనగరం కలెక్టరేట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): త్వరలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను చేపట్టనున్నామని.. దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి కోరారు. మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను హేతుబద్ధీకరించడానికి ఇదే తగిన సమయమని అన్నారు. పాత భవనాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను కొత్త భవనాల్లో మార్చడానికి, అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశం ఉందని చెప్పారు. మార్పులు, చేర్పులు, ఒక చోట నుంచి మరో చోటకు తరలించడానికి అవకాశం ఉందన్నారు. రాజాం నియోజకవర్గంలో 17, బొబ్బిలిలో 26, చీపురుపల్లిలో 4, గజపతినగరంలో 3, నెల్లిమర్ల 17, విజయనగరంలో 61, ఎస్.కోటలో 10 మొత్తం 138 పోలింగ్ కేంద్రాల్లో 1200 కంటే ఎక్కువగా ఓటర్లు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలు కావాలి

గరుగుబిల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు పారిశ్రామికవేత్తలు కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఈ నేపథ్యంలో వెలుగు సిబ్బంది రుణ లక్ష్యాలను అధిగమించాల్సి ఉందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీపీఎం రామ్మోహనరావు అన్నారు. గృహ అవసరాల ప్రణాళికల అమలుపై మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం సిబ్బందితో పాటు ఆయన ఏపీజీవీబీ మేనేజర్ దీక్షను మంగళవారం కలిశారు. అలాగే మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. వెలుగు కార్యాలయం పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల బయోమెట్రిక్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో గ్రామ పంచాయతీల పరిధిలోని వీవోఏలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు సీహెచ్ తిరుపతిరావు, బి.రామినాయుడు, టి.చంద్రమోహన్, వి.లక్ష్మణరావు, దాసులకు సూచించారు. సంఘ సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యాలను అధిగమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఎంసీపీ బి.బంగారమ్మ, ఏపీఎం ఎం.చినతల్లి, మండల వెలుగు కార్యాలయ సిబ్బంది ఉడమల శాంతికుమారి, వీవోఏలు ఇ.గౌరీ, బి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ఏపీజీవీబీ మేనేజర్‌తో మాట్లాడుతున్న డీపీఎం రామ్మోహనరావు

నిర్వహణ లేక.. నిరుపయోగంగా మారి


శిథిలావస్థకు చేరిన ఇరిగేషన్ కార్యాలయ భవనం

- వినియోగంలో లేక శిథిలావస్థకు చేరిన వైనం
- ఇదీ పురిటిపెంటలోని ఇరిగేషన్ కార్యాలయం పరిస్థితి

గజపతినగరం, జూన్17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పురిటిపెంట పంచాయతీలో గల మామిడిబందకాలనీలో ఇరిగేషన్ కార్యాలయం నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. ఏళ్ల తరబడి వినియోగంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరింది. జాతీయరహదారికి దగ్గరిలో ఉన్న ఈభవనం ప్రస్తుతం మందు బాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని పలువురు వాపోతున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశమున్నా అధికారులు చొరవచూపడంలేదని స్థానికులు చెబుతున్నారు. పురిటిపెంట పంచాయతీలోని మామిడిబందకాలనీలో 1981-82లో ఇరిగేషన్ కార్యాలయం నిర్మించారు. అప్పట్లో ఇరిగేషన్ డీఈలతో పాటు ఏఈలు ఇక్కడి నుంచి విధులు నిర్వహించేవారు. కాలానుగుణంగా అధికారులు ఇతర ప్రదేశాలకు బదిలీలపై వెళ్లిపోయారు. తర్వాత ఇక్కడకు అధికారులు వచ్చేందుకు సుముఖత చూపకపోవడంతో కార్యాలయంబోసిపోయింది. 2014-19లో టీడీపీ హయాంలో ఈ కార్యాయాలన్ని కుట్టుమిషన్ శిక్షణ కార్యాలయంగా, తరువాత లబ్ధిదారులకు ఆదరణ పరికరాల అందించేందుకు వినియోగించారు.2019లోఅధికారంలోకి వచ్చిన వైసీపీప్రభుత్వం ఈభవనాన్ని వినియోగించకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరింది.ఈనేపథ్యంలో కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలం ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భవనానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని మామిడిబందకాలనీ వాసులు సూచిస్తున్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

లక్కవరపుకోట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లివీడు రెవెన్యూ సర్వే నెంబరు 255-24 గెడ్డ సుమారు 1-98 ఎకరాలు, 254-1వాగులో సుమారు 0.62 ఎకరాల్లో కొందరు ఆక్రమించడంతో రెవెన్యూ అధికారులు మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. భూకబ్జాను అడ్డుకున్న దళితులు శీర్షికతో ఈనెల 15న కథనం ప్రచురితంకావడంతో రెవెన్యూశాఖ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు ఆర్ఐ సన్యాసిరావు ఆధ్వర్యంలో మంగళవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి సత్యసాయి అఖండ నామ సంకీర్తన

చీపురుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయి మందిరంలో బుధవారం ఉదయం నుంచి దివ్య అఖండ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఉదయం ఏడు నుంచి ఆదివారం ఉదయం 11గంటల వరకూ సత్యసాయి శత జయంత్యుత్సవం పురస్కరించుకుని ఆంజనేయపురంలోని మందిరంలో వంద గంటలపాటు సంకీర్తన కార్యక్రమం జరుగు తుందని పేర్కొన్నారు.

రేపు షర్మిల పర్యటన

రాజాం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పర్యటించనున్నట్లు రాజాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరంలోని మోపానిక్ టెంపుల్ ఫంక్షన్‌హాలులో పార్టీ జిల్లా స్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని కోరారు.

20న మండల సమావేశం

వేపాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వేపాడ మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అధికారులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

22న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

జామి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పావాడలో ఈనెల 22న జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతిఒక్కరూ తరలిరావాలని ప్రజా వాగ్గేయకారుడు ఆతవ ఉదయ్‌భాస్కర్ కోరారు. ప్రావాడలో విగ్రహావిష్కరణ కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దళితసంఘ నేతలు ఈశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

23 నుంచి సంగీత కళాశాలలో డిప్లమో పరీక్షలు

విజయనగరం బాబామెట్ట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత కళాశాలలో ఈనెల 23 నుంచి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సంబంధించి సర్టిఫికెట్ డిప్లమో పరీక్షలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శాస్త్రి తెలిపారు. 23, 24, 25 తేదీల్లో థియరీ పరీక్షలు, 27న ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకూ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

27లోగా ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

చీపురుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్, పదో తరగతిలో అడ్మిషన్లకు ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని చీపురుపల్లి బాలుర ఉన్నతపాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు సహాయ సమన్వయకర్త కె. మురళీధర్ 9440396983 నంబరుకు సంప్రదించాలని కోరారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్‌పై శిక్షణ

విజయనగరం దాసన్నపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తెలగ సామాజిక వర్గంలో ఆసక్తిగల వారికి కుట్టుమిషన్, సెల్‌ఫోన్ రిపేరింగు, బ్యూటీపార్లర్లపై శిక్షణ నిర్వహించనున్నట్లు ఆ సంక్షేమ సంఘ జిలా అధ్యక్షుడు పెద్ది లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం విజయనగరం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలోమాట్లాడుతూ ఆసక్తి గల వారు మాతా గాయిత్రీ 7075917828, ఎ.మధు 93953 92666, కె.శ్రీను 99087 18002 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన

రాజాం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణపొందిన వారికి ప్రభుత్వం రాయితీపై మిషన్లు అందజేస్తుందని ఎంపీడీవో వి. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రాజాం నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న లలితకుమారి

శృంగవరపుకోట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): . సీఎం నారా చంద్రబాబునాయుడు రైతుల సంక్షేమానికి కృషిచేస్తున్నారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమై వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో రైతులు విత్తనాలకు నమోదు చేసుకోవాలని చెప్పారు. నాలుగు రోజుల్లో రైతు ఖాతాల్లో నిధులు పడతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు రాయవరపు చంద్రశేఖర్, ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, టీడీపీ మండలాధ్యక్షుడు జీ.ఎస్ నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, నాయకులు కొణదం మల్లేశ్వరరావు, కాపుగంటి వాసు, పెదగాడి రాజు, చెక్క కిరణ్ పాల్గొన్నారు.

క్రీడా హబ్‌గా తీర్చిదిద్దాలి

లక్కవరపుకోట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే లలితకుమారి కోరారు. మంగళవారం లక్కవరపుకోటలో పి.శ్రీరాములు ఆధ్వర్యంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో నియోజకవర్గాన్ని జిల్లాలో ముందుండేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరమణ, వెంకటరావు, అప్పలకొండ, గాలి రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్‌ఈసీఎస్‌ను పునరుద్ధరించాలి

- చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు


చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న కళావెంకటరావు

చీపురుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యువత, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు కోరారు. చీపురుపల్లిలోని ఆర్‌ఈసీఎస్‌ను పునరద్ధరించడానికి ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు. ఈమేరకు బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చీపురుపల్లి నియోజకవర్గంలో పలు పరిశ్రమలు మూతపడి ఉన్నాయని, వాటిని తెరిపించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో కొత్త పరిశ్రమలు నెలకొల్పి యువత ఉపాధి అవకాశాలు మెరుగు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. తోటపల్లి కాలువ పూడిక తీత, లైనింగ్ పనులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు.

ప్రతి విద్యార్థి ఇంట్లో వెలుగులు

- రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందన పథకం కింద నిధులు జమ చేయడంతో ప్రతి విద్యార్థి ఇంట్లో వెలుగులు నిండాయని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు.విద్యార్థుల చదువులకు తోడ్పాటు అందించాలన్న ఉన్నతాశయంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తల్లికి వందన అమలుకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభమైన తొలిరోజు నుంచే తల్లి ఖాతాల్లో తల్లికి వందన పేరుతో రూ.15వేలకు గాను రూ.13వేలు జమచేశారని రూ. రెండు వేలు పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. వైసీపీప్రభుత్వం ఒక్కరికి మాత్రమే అమ్మఒడి పథకం వరింపజేసి తల్లులను మోసం చేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందన అందిస్తే, వైసీపీ ప్రభుత్వం 42 లక్షల మందికి మాత్రమే అందజేసిందని తెలిపారు.

'తల్లికి వందనం' తో విద్యాభివృద్ధి

- మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారాజు


మాట్లాడుతున్న బంగారాజు

భోగాపురం, జూన్17(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం వల్ల పేద కుటుంబాల్లో ఆర్థిక ప్రమాణాలు మెరుగుపడడంతోపాటు ప్రతి తల్లి తమ పిల్లలను పాఠశాలలకు పంపిస్తుందని దీంతో రాష్ట్రం అన్నివిధాలా విద్యాభివృద్ధి జరుగుతుందని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగారాజు తెలిపారు. మంగళవారం మండలంలెని పోలిపల్లి సమీపంలో విలేకరులతో మాట్లాడారు. విద్యను ప్రోత్సహించడమే ఈపథకం ఉద్దేశమన్నారు. ఈపథకం ద్వారా అర్హతగల తల్లికి ప్రతీ ఏడాది బ్యాంకు ఖాతాకు రూ.13వేలు జమ చేయగా, మరుగు దొడ్లు, పాఠశాల నిర్వహణకు రూ.రెండు వేలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీమండలాధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ,నాయకులు పి.అప్పలనారాయణ, ఎ.జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆలయ భూముల గుర్తింపునకు చర్యలు

శృంగవరపుకోట రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్మవరం కేశవస్వామి ఆలయానికి సంబందించి 47 ఎకరాలు భూమి గుర్తింపునకు దేవదాయశాఖ అధికారులు చర్యలుచేపట్టారు. ఆలయానికి సంబందించి ఆ 47 ఎకరాలు ఎక్కడ శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనంప్రచురితమైంది. దీంతోపూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈవో ప్రసాద్, మండలంలోని దేవాదాయశాఖసిబ్బంది భూముల విషయంపై విచారణచేశారు. ఆలయ భూములకు పట్టాదారుపుస్తకాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు లేఖలు రాయడంతో పాటుఆక్రమణభూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయించారు.త్వరలోనే భూమి పూర్తిస్థాయిలో గుర్తించి వేలంవేస్తామని ఈవో తెలిపారు. మంగళవారం ఈభూముల విషయంపై సన్యాసయ్య దేవస్థానం వద్ద దేవదాయశాఖ అధికారులు సమావేశం ఏర్పాటుచేశారు.


విజయనగరం రింగురోడ్డు: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


రాజాం: యోగాసనాలు వేస్తున్న సీనియర్ సిటిజన్లు

యోగాతో మానసికోల్లాసం

- జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర-2025పై అవగాహన కార్యక్రమాలు

యోగాతో మానసికోల్లాసం లభిస్తుందని పలువురువక్తలు తెలిపారు. మంగళవారం జిల్లాలో యోగాంధ్ర-2025పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

విజయనగరం రింగురోడ్డు, జూన్ 17(ఆంధ్రజ్యోతి):మానసిక రుగ్మతలను రూపుమాపి శారీరకంగా ఉల్లాసంగా ఉండేందుకు యోగా దోహదపడుతుందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. విజయనగరంలోని కాలిఘాట్ కాలనీలోని ఏసీబీ కార్యాలయం వద్ద యోగాంధ్ర-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం యోగా పట్ల ప్రజలను చైతన్యవంతులు చేసే విధంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుష్‌శాఖాధికారి ఆనందరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, సిటీ మిషన్ మేనేజరు సన్యాసిరావు పాల్గొన్నారు.

● చీపురుపల్లి, జూన్ 17(ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని ఎంపీడీవో ఎల్. త్రినాథరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు యోగా శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి రోజు యోగ చేయడం వల్ల శారీరక, మానసికఆరోగ్యం లభిస్తుందన్నారు.కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఐ.సురేష్, మండల పరిషత్ ఏఓ ప్రవీణ్, నాయకులు రౌతు కామునాయుడు, మన్నెపురి శ్రీనివాసరావు, మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు పాల్గొన్నారు.


● రాజాం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) యోగాతో సంపూర్ణ మానసిక శారిరక ఆరోగ్యాన్ని పొందవచ్చని కమిషనర్ జె.రామప్పలనాయుడు. ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తెలిపారు. రాజాం మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో సీనియర్ సిటిజన్లకు యోగాపై శిక్షణఇచ్చారు. కార్యక్రమంలో యోగా గురువు టీటీవీ రమణమూర్తి, ఆర్నిపల్లి వెంకటనాయుడు, పెంకి గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

● భోగాపురం, జూన్17(ఆంధ్రజ్యోతి):యోగాపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతుబంగా రాజు కోరారు. పోలిపల్లిలో యోగాపై స్థానికులకు అవగాహన కలిగించారు.

● లక్కవరపుకోట, జూన్ 17(ఆంధ్రజ్యోతి): యోగాతోనే ఆరోగ్యం సాధ్యమని కొట్యాడ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జామి అప్పలనాయుడు తెలిపారు. కొట్యాడలో విద్యార్థులతో యోగా కార్యక్రమం నిర్వహించారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయాలి

- పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎస్ఎన్ వర్మ


మాట్లాడుతున్న ఎస్ఎన్ వర్మ, సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, భాష్యం ప్రవీణ్ తదితరులు

విజయనగరం రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవం విజయవంతంచేయాలని పిఠాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎస్ఎన్ వర్మ కోరారు. మంగళవారం విజయనగరంలో ఎమ్మెల్యేలు అదితిగజపతిరాజు,భాష్యం ప్రవీణ్‌తో కలిసి నియోజకవర్గనాయకులతో యోగాదినోత్సవఏర్పాట్లపై సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, డివిజన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తిబంగారుబాబు, నర్సింగరావు, కంది మురళీనాయుడు, అవనాపు విజయ్, సూర్యకుమారి, అనురాధ బేగం పాల్గొన్నారు.

కార్మికులకు గ్రాట్యూటీ చెల్లించాలి

నెల్లిమర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల జ్యూట్ మిల్లు రిటైర్డ్ కార్మికుల గ్రాట్యూటీ చెల్లించడానికి చర్యలు చేపట్టాలని బీజేపీ నెల్లిమర్ల మండల కమిటీ అధ్యక్షుడు మైపాడ ప్రసాద్ కోరారు.ఈ మేరకు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవికి రిటైర్డ్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్మికులు ఉద్యోగవిరమణ చేసిన సంవత్సరాలు గడుస్తున్నా మిల్లు యాజమాన్యం గ్రాట్యూటీ సొమ్మును చెల్లించడం లేదని వివరించారు.

ప్రధాని కార్యక్రమానికి సిద్ధంకావాలి

- యోగాంధ్ర అబ్జర్వర్ నక్కా ఆనందబాబు


మాట్లాడుతున్న ఆనందబాబు

భోగాపురం, జూన్17(ఆంధ్రజ్యోతి): విశాఖ బీచ్ తీరంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానుండడంతో విజయవంతం కావడానికి ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని యోగాంధ్ర అబ్జర్వర్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మార్క్‌ఫెడ్ చైర్మన్ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగారాజు కోరారు.మంగళవారం పోలిపల్లి సమీపంలోని ఓ ప్రైవేటు లేఅవేట్‌లో యోగాంధ్ర-2025 కార్యక్రమంపై ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భోగాపురం టీడీపీ మండ లాధ్యక్షుడు కర్రోతు సత్యనారాణ, పతివాడఅప్పలనారాయణ, ఆకిరిప్రసాదు, మహంతి శంకరరావు, గేదెలరాజారావు, చిల్లా పద్మ పాల్గొన్నారు.

నీటి తరలింపు ఉత్తర్వులు రద్దుచేయాలి

గంట్యాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ పేరుతో జిందాల్ కంపెనీకి తాటిపూడి సాగునీటి ప్రాజెక్టు నీరును తరలించడం సరికాదని భీమసింగ్ షుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్‌పర్సన్ గుల్లుపల్లి లలిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిందాల్ కంపెనీకి తాటిపూడి నీటిని తరలించే విషయంలో జారీచేసిన ఉత్తర్వులు ప్రభుత్వం రద్దుచేయాలని కోరారు.జీవీఎంసీ వర్గాలు తాగునీరు పేరుతో తాటిపూడి నీటిని పరిశ్రమలకు అమ్మడం మొదలు పెట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వం చేసుకున్న కన్వినియన్స్ సేల్ రీడ్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

పైడిమాంబ ఆలయ ఈవోగా శిరీష

విజయనగరంరూరల్,జూన్17(ఆంధ్రజ్యోతి):పైడిమాంబ ఆలయ ఈవో (ఎఫ్ఏసీ)గా జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆలయ ఉద్యోగులు, అర్చకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఎయిర్‌పోర్టు పనుల్లో విషాదం

- కుప్పకూలిపోయి పూసపాటిరేగ వాసి మృతి

భోగాపురం, జూన్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచేరు సమీపం ఎయిర్‌పోర్టు నిర్మాణంలో విషాదం నెలకొంది. ఈమేరకు పూసపాటిరేగకు చెందిన కూలి చందక సూర్యనారాయణ(55) మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ వి.సూర్యకుమారి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. సూర్యనారాయణ కొద్దిరోజులుగా ఎయిర్ పోర్టు నిర్మాణంలో కూలిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో పనిచేస్తుండగా కుప్పకూలిపోయాడు. దీంతో అక్కడ పనిచేసేవారు విజయనగరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు.సూర్యనారాయణ కోడలు చందక వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్సపొందుతూ బాలిక..

కొత్తవలస, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విషపురుగు కరిచి అస్వస్థతకు గురైన బాలిక చికిత్సపొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సంతపాలెం గ్రామానికి చెందిన నక్కెళ్ల ప్రవల్లిక(14) తుమ్మికాపల్లిలోగల కస్తూర్బా పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది.ఈనెల 11వ తేదీ రాత్రి సంతపాలెంలో ప్రవల్లిక నిద్రిస్తున్న సమయంలో ఏదో విష పురుగు కరిచింది. కొద్దిసేపటి తర్వాత ప్రవల్లికకు వాంతులు కావడంతో చికిత్సకోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు మంగళవారం తెల్లవారుజామున చికిత్సపొందుతూ మృతి చెందినట్లు బాలిక తండ్రి నక్కెళ్ల వెంకట రమణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ షణ్ముఖరావు కేసు నమోదుచేసి దర్యాప్తు నిమిత్తం హెచ్‌సీ సూరిబాబుకు అప్పగించారు. ప్రవల్లిక మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం

చీపురుపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్ రోడ్డులో మండలపరిషత్‌కు ఎదురుగా ఓ వస్త్రదుకాణంలో మంగళవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 9.5 లక్షలు విలువచేసే దుస్తులు దగ్ధమయ్యాయని అగ్నిమాపకశాఖ సిబ్బంది తెలిపారు. ప్రమాద వార్త తెలియగానే అగ్నిమాపక అధికారి సాంబమూర్తి నేతృత్వంలో సిబ్బంది చేరుకొని మంటలను అదుపుచేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు.వేకువజామున ప్రమాదం జరగడంతో దుకాణంలోఉన్న సుమారు 25 లక్షలు విలువ చేసే సరుకు పూర్తిగా కాలిపోయినట్లు షాపు యాజమాని కె.జగదీష్ ఆవేదన వ్యక్తంచేశారు.

విద్యార్థులకు తప్పిన పెనుప్రమాదం

- డెంకాడలో ఢీకొన్న స్కూల్, ఆర్టీసీ బస్సులు


ఘటనా స్థలంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

డెంకాడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): డెంకాడలో ఓ ఆర్టీసీ, స్కూల్ బస్సు మంగళవారం ఢీకొన్న ఘటనలో పెనుప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ సన్యాసినాయుడు కథనం మేరకు.. డెంకాడలో ఓ ఇంగ్లీషు మీడియం స్కూల్ బస్సు నాతవలస వైపు నుంచి విజయనగరం వెళ్తోంది. అదే సమయంలో విజయనగరం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీబస్సు ఆ బస్సును ఢీకొంది.ఆ సమయంలో ఆర్టీసీబస్సులో 30 మంది ప్రయాణికులు, స్కూల్ బస్సులో 34 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే విద్యార్థులు, ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్వల్ప గాయాలైన విద్యార్థులను 108లో ప్రథమ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు.ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే సమయంలో విజయనగరం వెళ్తున్న స్థానిక ఎమ్మెల్యే లోకంనాగమాధవి సహాయ చర్యల్లో పాల్గొని విద్యార్థుల పరిస్థితిని అడిగితెలుసుకున్నారు.

ఆహారం లేక.. తాగు నీరందక

- గూడెంలో 40 ఆవులను నిర్బంధించిన వైనం
- పరిశీలించి కేసు నమోదుచేసిన పోలీసులు


టేకు తోటలో ఉన్న ఆవులను పరిశీలిస్తున్న పోలీసు

గుర్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామ సమీపంలో ఓ లేఅవుట్‌లో గల టేకు తోట వద్ద నాలుగు రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు 40 ఆవులు అక్రమంగా నిర్బందించారు. వీటిని కబేళాలకు తరలించేందుకే ఇక్కడ ఉంచారని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ విషయంపై కొంతమంది ఫిర్యాదుచేయడంతోపరిశీలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇక్కడ 40 ఆవులు నిర్బందంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీటికి నాలుగు రోజుల నుంచి పశు గ్రాసం, గడ్డి అందకపోవడంతో ఆహారం లేకపోవడంతో అల్లాడిపోతున్నాయి. కనీసం తాగునీరు సైతం లేకపోవడంతో బక్కచిక్కిపోయాయి. ఈ నేపథ్యంలో బీజేపీ మండలాధ్యక్షులు కనకరాజు, కొరాయి వెంకటప్పలనాయుడు, ఆకుల మహేష్ ఆవులను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. గోవులను రక్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

శ్మశానవాటికలో భవనం కూలదీతపై విచారణ

పూసపాటిరేగ, జూన్17(ఆంధ్రజ్యోతి): కొవ్వాడ అగ్రహారంలోని శ్మశానవాటికలో గల ఓ భవనం అనుమతి లేకుండా కూలదీతపై ఇన్‌చార్జి పంచాయతీ అధికారి భూషన్ మంగళవారం విచారణ నిర్వహించారు. స్థానికులు కొందరు ఎంపీడీవోకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ భవనం పాడవడంతో సర్పంచ్ కోట్ల రఘుకు విన్నవించుకోగా గ్రామసభను నిర్వహించి తీర్మానించినట్లు తెలిపారు. తమ అభిప్రాయం మేరకు కూలదోశారని, దీనిపై కొందరు ఫిర్యాదులు ఇవ్వడం సరికాదని చెప్పారు. కాగా ప్రజలు దీనిని తొలగించాలని ఒత్తిడి తీసుకురావడంతో గ్రామసభలో తీర్మానించామని, శ్మశానవాటికలో సొంత నిధులు సుమారు 10 లక్షలు వెచ్చించి మిగిలిన అభివృద్ధి చేశానని కోట్ల రఘు తెలిపారు. అలాగే నివేదికలు ఉన్నతాధికారులకు పంపిచామని, దీనిపై వారు నిర్ణయం తీసుకుంటారని భూషన్ చెప్పారు.

ప్లాస్టిక్ సర్జరీపై అవగాహన

విజయనగరం రింగురోడ్డు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యులకు ప్లాస్టిక్ సర్జరీ యాస్కులర్ వ్యాధులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్లాస్టిక్ సర్జన్ డాక్టరు ముద్దాడ శ్రావణి గ్రహణం మొర్రి ప్లాస్టిక్ సర్జరీ, కాస్మోటిక్ సర్జరీల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు జంపుం జ్యోషి, గెద్ద చిరంజీవి, కోట్ల పైడిరాజు, కర్రి సత్యనారాయణ, గుప్తా, త్రినాథరావు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్‌లో సత్తాచాటిన రాజాం క్రీడాకారులు

రాజాం,జూన్17(ఆంధ్రజ్యోతి):రాజాంక్రీడాకారులు శ్రీకాకుళం జిల్లా పొందూరుమండలంలో జరిగిన జిల్లాస్థాయి పురుషుల బెంచ్ ప్రెస్ బాడీ బిల్డింగ్‌లో పోటీలో సత్తాచాటారు. 74 కేజీలు విభాగంలో డేవిడ్ ఒకటో స్థానం, 66 కేజీలు విభాగంలో రౌతుమణి మూడోస్థానం సాధించడంతో రామాంజనేయ పవర్ జిమ్ కోచ్ చంద్రశేఖర్ అభినందించారు.

జనగణనతో మార్పులెన్నో..

(5వ పేజీ తరువాయి)

గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాలు ఉన్నాయి. అయితే గరుగుబిల్లి, బలిజిపేట మండలాలు విజయనగరం జిల్లా బొబ్బిలి అర్బన్‌లో కలిసి ఒక నియోజకవర్గంగా ఏర్పడనున్నాయి. కొమరాడ మండలం పార్వతీపురంలో కలిసే వీలుంది. పాలకొండ నియోజకవర్గంలో పాలకొండ నగర పంచాయతీ, మండలంతో పాటు భామిని, సీతంపేట, వీరఘట్టం మండలాలు ఉన్నాయి. భామిని మండలం శ్రీకాకుళం జిల్లాకు వెళ్లే అవకాశం ఉంది. కుల, జనగణన అనంతరం నియోజకవర్గాల ఏర్పాటుపై స్పష్టత రానుంది. ఏ నియోజకవరంలో ఏ సామాజిక వర్గం ఉండాలి.. ఎంతమంది ఓటర్లు, జనాభా ఉండాలనేది కూడా తేల్చనున్నారు.

గిరిపుత్రుల దశ మారేనా?

(5వ పేజీ తరువాయి)

నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు ఎస్ఎస్ఏ(సమగ్ర శిక్షా అభియాన్) నిధులతో కొండాడ, రామానగరం, చిన్నపల్లంకి, కోవువలస, వలగెడ్డ, వెదురువలస, పొంజాడ గ్రామాల్లో పక్కా పాఠశాలల భవనాలు నిర్మించనున్నారు. రూ.13.05లక్షలతో ఒక్కో భవనం నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే కోవువలస గ్రామంలో పాఠశాల భవనం పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన భవన నిర్మాణాలను కూడా మూడు నెలల్లో పూర్తిచేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పల్లెపండుగ ద్వారా ఎంపీయూపీ, ఆశ్రమ పాఠశాలలు ప్రహరీల నిర్మాణాలు పూర్తిచేసిన సంగతి తెలిసిందే. ఏదేమైనా పాఠశాల భవనాలు త్వరగా అందుబాటులోకి వస్తే గిరిజన విద్యార్థుల ఇబ్బందులు తప్పుతాయని ప్రజా సంఘాల నాయకులు, తల్లిదండ్రులు చెబుతున్నారు.

ఎంఈవో ఏమన్నారంటే..

'సీతంపేట ఏజెన్సీలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలల స్థానంలో పక్కా భవనాల కోసం గత వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపించాం. అప్పట్లో సకాలంలో నిధులు మంజూరు కాలేదు. దీంతో పునాదుల స్థాయిలోనే నిర్మాణాలు నిలిచిపోయాయి. మరికొన్ని పాఠశాలలు రేకులషెడ్లల్లో నడుస్తున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ఇటువంటి పాఠశాలల స్థానంలో పక్కా భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. వాటి నిర్మాణాలు పూర్తయితే గిరిజన చిన్నారులకు ఇబ్బందులు తప్పుతాయి.' అని ఎంఈవో ఆనందరావు తెలిపారు.

'ఆడుదాం..ఆంధ్రా' నిధులపై విజిలెన్స్

(5వ పేజీ తరువాయి)

క్రీడలకు సంబంధించి నియోజకవర్గాల్లో నిధుల ఖర్చు తదితర అంశాలపై విచారణ చేపడుతున్నామన్నారు. త్వరలోనే దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందిస్తామని వెల్లడించారు.

లోతుగా విచారణ

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 డిసెంబరు నుంచి 2024 జనవరి రెండో వారం వరకు 'ఆడుదాం.. ఆంధ్రా' నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులకు కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. అప్పట్లో వాటి నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు కేటాయించింది. మండలస్థాయిలో మరిన్ని నిధులు మంజూరు చేశారు. నియోజకవర్గ , జిల్లా స్థాయికి వచ్చే సరికి వైసీపీ నాయకుల కనుసన్నల్లో అధికారులు ఈ పోటీలు నిర్వహించి నిధులు వినియోగించారు. అయితే 'ఆడుదాం..ఆంధ్రా' పేరిట మంజూరైన నిధుల వినియోగంపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కూటమి ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు. ఈ క్రమంలో అప్పట్లో ఆడుదాం..ఆంధ్రా నిర్వహణలో పాల్గొన్న సచివాలయాలు, మున్సిపల్ అధికారులు, ఎంపీడీవోలు ఉలిక్కి పడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

పాలకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పనుకువలస వద్ద మంగళవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వీరఘట్టం మండలం మొట్ట గ్రామానికి చెందిన ఎల్.దుర్గారావు, రమ్య దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. పాలకొండ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వీరఘట్టం నుంచి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం పనుకువలస గ్రామం వద్ద ఢీకొట్టింది. ఈ ఘటనలో దుర్గారావు కాలుకు తీవ్ర గాయాలు కాగా రమ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 వాహనం ద్వారా వీరిని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రమ్యను రాజాం ఆసుపత్రికి, దుర్గారావును విశాఖపట్నం రిఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి బిల్లులు చెల్లించండి

సీతానగరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు, చిన్న, సన్నకారు రైతులకు ఉపాధి పనులు కల్పించాలని, తక్షణమే ఉపాధి బిల్లుల బకాయిలు చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్‌కు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి రెడ్డి లక్ష్మంనాయుడు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరు వారాలుగా బకాయిలు చెల్లించలేదని, వేతనదారులకు 200 రోజులు పనులు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని కోరారు. ఉపాధి బిల్లులు వేశామని ప్రకటించిన ప్రభుత్వం రెండు వారాలు బ్యాంకులకు జమ చేయకపోవడంతో అప్పుల కోసం తిరగాల్సి వస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ఈశ్వరరావు, జె.వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, ఎం.రాఘవ, రెడ్డి శ్రీను, సత్యనారాయణలు పాల్గొన్నారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

సాలూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం తమకు తల్లికి వందనం పథకానికి అర్హత కల్పించాలని పురపాలకసంఘం పారిశుధ్య అవుట్‌సోర్సింగ్ కార్మికులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జయరాంకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పురపాలకసంఘంలో పారిశుధ్య విభాగం అవుట్‌సోర్సింగ్ కార్మికులకు అందరికీ తల్లికి వందనం పథకం పరిధిలోకి తీసురావాలని ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు టి.రాముడు, టి.శంకరరావులు కోరారు.

మెరుగైన బోధన అందించాలి

గరుగుబిల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రణాళికల మేరకు మెరుగైన బోధన అందించాలని ఎంఈవో దత్తి అప్పలనాయుడు సూచిం చారు. మండల కేంద్రంలోని మోడల్ ప్రైమరీ పాఠశాల ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నెలవారీ, సంవ త్సరానికి సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు యూ నిట్ల వారీగా బోధన నిర్వహించాలన్నారు. ఉపాధ్యా యులు విధిగా సమయపాలన పాటించి ప్రైవేటు పాఠ శాలలకు దీటుగా బోధన నిర్వహించాలన్నారు. విద్యా ర్థులకు అందించిన కిట్లును నిశితంగా పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలతో కూడిన విధంగా అందించాలన్నా రు. ఈ పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు ఎం.సింహాచలం, జి.శంకరరావు, బి.శివకుమార్ ఉన్నారు.

మారనున్న గిరిజనుల బతుకులు

- 'ఉత్కర్ష్ అభియాన్'కు జిల్లాలో 165 గ్రామాల ఎంపిక
- మంత్రి సంధ్యారాణి



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా గిరిజనుల బతుకుల్లో స్వర్ణయుగం రానున్నట్టు రాష్ట్ర గిరిజన, స్త్రీశిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కొత్తవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ధర్తి ఆబజన్-జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. భారత ప్రభుత్వం గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా 2024 అక్టోబరు 2న ప్రారంభించిన ఈ పథకం దేశంలోని గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధికిగానూ రూపొందించారని అన్నారు. ఈ పథకం 2024-25 నుంచి 2028-29 వరకు 5 సంవత్సరాలపాటు అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ పథకం కింద దేశంలో గిరిజనులు నివసించే 63వేల 843 గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య సేవలు, జీవనోపాధి, రోడ్లు అనుసంధానం, ఆర్థిక సాధికారిత వంటి కీలకరంగాల్లో అభివృద్ధి చర్యలు చేపడతాయని ఆమె వివరించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 165 గిరిజన గ్రామాలను ఎంపిక చేశారని ఆమె తెలిపారు. వీటికి సంబంధించి సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. దీనిపై జూన్ 15 నుంచి 30 వరకు అవగాహన, ప్రయోజన సదస్సులు నిర్వహిస్తారని ఆమె తెలిపారు. ప్రతి గిరిజన గ్రామంలో గిరిజన స్థితిగతులపై సర్వే నిర్వహించి గిరిజనులకు 14 ప్రభుత్వ ప్రధాన సేవలు అందిస్తామని ఆమె చెప్పారు.

రాష్ట్రంలో డోలీ మోతలు లేకుండా రూ.1300 కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టారని ఆమె తెలిపారు. అందులో భాగంగా సాలూరు నియోజకవర్గంలో రూ.110 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా నేరుగా తల్లుల ఖాతాల్లోకి రూ.13వేలు జమ చేశామన్నారు. 16వేల 500 ఉపాధ్యాయ ఉద్యోగాలకు డీఎస్సీ ద్వారా నియామక ప్రక్రియ చేపడితే అందులో 2 వేల మంది టీచర్లు కేవలం ఎస్టీలేనని ఆమె తెలిపారు. త్వరలో అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు లబ్ధి చేకూరనుందన్నారు. ఐటీడీఏ ద్వారా 18 రకాల సంక్షేమ పథకాలు గిరిజనులకు లబ్ధి చేకూర్చనున్నాయన్నారు.

తప్పుడు ప్రచారం సరికాదు

తాను తోణాంలో నిర్వహించిన బహిరంగ సభలో మెట్టవలస గ్రామానికి పాఠశాల భవనం వారం పదిరోజుల్లో మంజూరు చేస్తానని చెప్పిన మాటకు కట్టుబటి ఉన్నానని ఆమె స్పష్టం చేశారు. పాఠశాల భవనం నిమిత్తం నిర్మాణం కోసంరూ.16 లక్షల నిధులు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచామని, టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే నిర్మాణాలు ప్రారంభమవు తాయన్నారు. ఈలోగా పాఠశాల భవన నిర్మాణానికి చందాలు వసూలు చేస్తున్నట్టు లేనిపోని రాద్ధాంతం చేయడం సరికాదని ఆమె తెలిపారు. అనంతరం గిరిజనులకు ధ్రువపత్రాలు అందజేశారు. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసిన బ్యాగులు, కిట్లు, పుస్తకాలను అందజేశారు.

డప్పు కొట్టి.. థింసా నృత్యం చేసి..

కార్యక్రమం అనంతరం మంత్రి సంధ్యారాణి గిరిజనుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు డప్పు వాయించారు. అలాగే గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆముదాల పరమేశ్, డీఎంహెచ్‌వో భాస్కరరావు, ఎంపీడీవో పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమింపజేసిన ఎమ్మెల్యే



మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులతో పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 8 రోజులుగా మున్సిపల్ ఇంజనీరింగ్ తాగునీటి సరఫరా కార్మికులు సమ్మె నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం రాత్రి ఈ సమ్మెను విరమింపజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాల్టీలోని 30 వార్డుల ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తాగునీటి సరఫరా కార్మికులతో చర్చించామని, త్వరలోనే వారి సమస్యలను పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

పార్వతీపురం రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పార్వతీపురం మండలం పెదబొండపల్లికి చెందిన ఎస్.నారాయణరావు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లక్ష రూపాయలు మంజూరయ్యింది. ఈ చెక్కును ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.

బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

సీతానగరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాడైన బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, వంతెన పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో జరుగుతున్న వంతెన పనులను, అప్పయ్యపేట-సీతానగరం గ్రామాల మధ్య ఉన్న వంతెనపై ఏర్పడిన గోతులను ఆయన మంగళవారం ఆర్అండ్‌బీ డీఈ అప్పాజీతో కలిసి పరిశీలించారు. రూ.12కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జె.తేరేజమ్మ, ఉప సర్పంచ్ అరవింద్‌కుమార్, మాజీ ఎంపీటీసీ ఎస్.శ్రీనివాసరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగు సీసీపై చర్యలు తీసుకోండి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీ క్లస్టర్ వెలుగు సీసీ గరుగుబిల్లి శ్రీనివాసరావు 2014 నుంచి 2020 వరకు పనిచేసి 23 లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారని గిరిజన సంఘం జిల్లా నాయకులు మండంగి రమణ, మండల శ్రీనివాసరావు ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. అవినీతికి పాల్పడినా మళ్లీ వెలుగు అధికారులు అదే క్లస్టర్‌లో నియమించడం తగదన్నారు. ఇది అవినీతికి ప్రోత్సహించినట్టేనన్నారు. సుమారు 14 సంఘాల నుంచి ట్రైబుల్ సబ్‌ప్లాన్ నిధులను ఉన్నతి పథకం కింద గిరిజనులకు అప్పులు ఇస్తామని చెప్పి వారితో సంతకాలు చేయించుకుని శ్రీనివాసరావు అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఈ అవినీతిపై పార్వతీపురం ఐటీడీఏ పీవో, ఇద్దరు వెలుగు ఏపీఎంలకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. దర్యాప్తు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తిరుపతిరావు, శంకరరావు, సన్యాసిరావు, సుబ్బారావు ఉన్నారు.

సీమలవానివలస సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యేకి విన్నవించిన గ్రామస్థులు



ఎమ్మెల్యే జగదీశ్వరికి సమస్యలను వివరిస్తున్న గ్రామస్థులు

గుమ్మలక్ష్మీపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గరుగుబిల్లి మండలం, శివ్వాం పంచాయతీ సీమలవానివలస గ్రామస్థులు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. ఈ మేరకు మంగళవారం గుమ్మలక్ష్మీపురంలోని తన నివాసగృహంలో ఆమెను కలిసి, వినతిపత్రం అందించారు. వర్షాకాలంలో మట్టి రోడ్డు వల్ల ఇబ్బందులు పడుతున్నామని సీసీ రోడ్డు గానీ, బీటీ రోడ్డు గానీ మంజూరు చేయాలని కోరారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉన్నందున నూతన భవనం మంజూరు చేయాలని, తాగునీటి ఓవర్ ట్యాంకు కారిపోతూ ఉన్నందున కొత్త వాటర్ ట్యాంకు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి గ్రామ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి ట్యాంక్ వద్ద ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలుపుతున్న విద్యార్థులు

పాలకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బడ్డుమాసంగి గ్రామంలోని ప్రభుత్వ ట్రైబుల్ వెల్ఫేర్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రానికి తాగునీటి సమస్య వెంటాడింది. గత ప్రభుత్వ ఉన్నతాధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదు. తాజాగా కూటమి నాయకులు వేణువు అనీల్‌కుమార్, ఎంపీటీసీ నిమ్మక దుర్గమ్మ తదితరులు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ఈ సమస్యను విన్నవించారు. స్పందించి ఆయన తాగునీటి ట్యాప్, ట్యాంకును ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకున్నారు. మంగళవారం తాగునీటి ట్యాంకును ప్రారంభించారు. పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రానికి తాగునీరు అందించారు. దీంతో ఎమ్మెల్యేకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అనీల్‌కుమార్, నిమ్మక ప్రసాదరావు, భీమలింగం, శ్రీనివాసరావు చంద్రయ్య, పాఠశాల హెచ్ఎం మండల సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్త చామంతి పాల్గొన్నారు.

హామీ ప్రకారం దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

పార్వతీపురంటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల కోసం సహాయ సహకారాలు అందించిన పారిశుధ్య కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం దుస్తులు పంపిణీ చేసిందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మంగళవారం పార్వతీపురంలోని తన చాంబర్‌లో కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. విజయవాడ వరద బాధితులకు సేవలందించిన మున్సిపాల్టీ పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తగురీతిలో సత్కరించామని అన్నారు.

జీవో నెం.26 అమలు చేయాలి

మున్సిపల్ పారిశుధ్య నిర్వహణ కార్మికులకు ఆదాయ పరిమితిని మినహాయిస్తూ జీఎంఎస్ నెం.26ను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు జీవీ రమణ, పి.సన్యాసిరావు, సూరిబాబులు కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. వారికి తల్లికి వందనాన్ని అమలు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు.

సహాయ గణాంకాధికారిగా ఉమామహేశ్వరరావు

గరుగుబిల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల సహాయ గణాంకాధికారిగా చుక్క ఉమామహేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏఎస్‌వోగా విధులు నిర్వహించిన ఎస్.తవుడు బదిలీ అయిన అనంతరం ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈ మేరకు పూర్తి స్థాయిలో ఏఎస్‌వోగా ఉన్నతాధికారులు నియమించారు. ఉమామహేశ్వరరావు మక్కువ మండలం ఏఎస్‌వోగా విధులు నిర్వహించి గరుగుబిల్లికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం గరుగుబిల్లితో పాటు పాచిపెంట, మక్కువ మండలాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదికి సంబంధించి చిన్న నీటి పారుదల వనరుల గణనతో పాటు ఖరీఫ్‌లో పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అలాగే 2026కు సంబంధించి జనాభా లెక్కల సర్వేను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్టు తెలిపారు.

కొఠియా గ్రామాల్లో కొరాపుట్ కలెక్టర్ పర్యటన

సాలూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలంలో ఉన్న కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా రాష్ట్రం కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తివాసన్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత ఆయన మూలతాడివలసలో ఉన్న సుభాస్‌చంద్రబోస్ రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించారు. అలాగే గ్రామస్థులతో మాట్లాడి ఒడిశా పథకాలపై ఆరా తీశారు. ధూళిభద్ర, ఎగువశెంబిలో ఒడిశా అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కొఠియాలో ఒడిశా మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అలాగే కొఠియాలో నిర్వహించనున్న రథయాత్రపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డోలియాంబ, ముడకారు గ్రామాల్లో పర్యటించారు. ఆయనతో కొరాపుట్ జిల్లా, పొట్టంగి బ్లాక్ అధికారులు ఉన్నారు.

కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో యోగాంధ్ర



పాలకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. స్థానిక యోగా మాస్టార్ ధనుంజయ్ సుమారు 40 మంది సభ్యులతో యోగాసనాలు వేయించారు. యోగా కేంద్ర నిర్వాహకుడు బొడ్డు రామ్మోహన్, ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న దృశ్యం

అందుబాటులో వరి విత్తనాలు

మక్కువ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలను రైతు మీసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు ఏవో చింతల భారతి తెలిపారు. మార్కొండపుట్టి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా పొలం గట్లు మీద వేసుకొనేందుకు కంది విత్తనాలను వంద శాతం రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ● సీతంపేట రూరల్: మండలంలో హడ్డుబంగి, గొయిది గ్రామాల్లో ఏవో వై.వాహిణి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు 90శాతం సబ్సిడీతో కూడిన వరి విత్తనాలు పంపిణీ చేశారు. ● సీతానగరం: మండలంలోని పనుకుపేట, అంటిపేట గ్రామాల్లో మంగళవా రం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా మండల వ్యవసాయా ధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ రైతులకు గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా బీపీటీ 2846 రకం విత్తనాలను సబ్సిడీపై అందజేశామని చెప్పారు. అత్యధిక దిగుబడి వచ్చే రకమని, తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూమికి మేలు

వీరఘట్టం: మండలంలోని కుంబిడి ఇచ్చాపురం, గదబవలస గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏవో సౌజన్య మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు భూమికి మేలు చేస్తాయన్నారు. కౌలు రైతులకు కార్డులు జారీ చేస్తున్నామని చెప్పారు. అనంతరం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. మండలానికి 720 టన్నుల వివిధ రకాల విత్తనాలు వచ్చాయని, రైతులందరూ వారికి కావాల్సిన విత్తనాలు తీసుకోవాలన్నారు.

న్యూస్ బాక్స్

మున్సిపల్ సిబ్బందిపై విచారణ

పార్వతీపురంటౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరాశ్రయుల వసతిగృహ నిర్వహణకు పాలకవర్గ ఆమోదం కోసం మున్సిపల్ కార్యాలయ సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు తమకు అన్ని విధాలుగా ఆశ చూపి మోసం చేశారని పట్టణానికి చెందిన ఓ ఎన్జీవో యజమాని.. రీజనల్ డైరెక్టర్ రవీంద్రకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం విచారణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులను విచారించి, తదుపరి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పారు.

మక్కువ ఏవోగా భారతి

మక్కువ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా చింతల భారతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె సాలూరు వ్యవసాయశాఖాధికారిగా పనిచేస్తూ బదిలీలపై మక్కువ వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏవో బొత్స శ్రీనివాసరావుకు విజయనగరం జిల్లా తెర్లాం మండలానికి బదిలీ అయింది.

నేడు ఏఎంసీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

సాలూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా పాచిపెంట మండలం మాతుమూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ముఖీ సూర్యనారాయణ స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు పాలకవర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీ నాయకులందరూ తరలిరావాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా వేలాడుతున్న చెట్టు కొమ్మ

పాలకొండ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలకొండ-రాజాం ప్రధాన రహదారిలో గోపాలపురం, మంగళాపురం గ్రామాల మధ్య ఉన్న మలుపు వద్ద ప్రమా దం పొంచి ఉంది. రెండు రోజుల కిందట వీచిన ఈదురుగాలులకు భారీ చెట్టు కొమ్మ విరిగింది. అవి ప్రధాన రహదారికి అడ్డంగా వేలాడుతూ కనిపిస్తుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఎమ్మెల్యేని కలిసిన మహిళా సమాఖ్య సభ్యులు

గుమ్మలక్ష్మీపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు మంగళవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. మహిళా సంఘాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. మహిళల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సాయం ఉంటుందని ఆమె అన్నారు. జిల్లా మహిళా సమాఖ్య ప్రెసిడెంట్ కె.లలితకుమారి, సెక్రటరీ సుబ్బలక్ష్మి, ట్రెజరర్ పి.రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి రూరల్ , జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండల పరిధిలో గల 33/11 కేవీ సబ్ స్టేషన్, పిరిడిలో ఆర్‌డీఎస్ఎస్ స్కీంలో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేయడం వల్ల బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ ఆవాల అనంతరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.